ఈ వారం బహుమతి పొందిన కథ

# తలుపులు



—ఎమ్.నాగరాజు

జయరాం మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. అతనికి ఇద్దరు అక్కయ్యలు, ఇద్దరు చెల్లెళ్ళు వుండడంచేత వాళ్ల పెళ్ళిళ్ళు చేశాక అతను పెళ్లి చేసుకోవడంవల్ల వయసుబాగా దాటి పోయింది.

జయరాం వివాహం జరిగి మూడు నెలలు కావస్తోంది; పోయిన్నెల్లోనే భార్యను కాపురానికి తీసుకువచ్చాడు. ఊరికి మారుమూలలో వున్న ఒక సందులో అద్దె ఇల్లు దొరికిందతనికి.

సామాన్యంగా ఇల్లు మెయిన్ రోడ్డులో వుంటేనో, వీధిలో జనసంచారం ఎక్కువగా ఉంటేనో ఇంటివాళ్లు వీధి తలుపులను మూసి వుంచుతారు. కానీ జయరాం అద్దెకున్నది మారుమూల సందులోని ఇంట్లో. జనసంచారం బొత్తిగా వుండదు. అతని ఎదురింటి తలుపులు ఎక్కువసేపు మూసుకునే ఉంటాయి.

జయరాం అద్దెకున్న ఎదురింట్లో పరశురాం అనే వ్యక్తి వున్నాడు. అతని వయసు జయరాం కన్నా చాలా ఎక్కువ. అతనికి ఇద్దరు పిల్లలుకూడా ఉన్నారు. పిల్లలు డిగ్రీ చదువులు చదువుతున్నారు.

పిల్లలు కాలేజీకి వెళ్లగానే పరశురాం తలుపుల్ని మూయడం జయరాం చూశాడు చాలాసార్లు. అంతేకాదు పరశురాం ఆఫీసునుండి ఇంటికి రాగానే పిల్లలు ఇంట్లో లేకుంటే సరి తలుపులు వేసుకోవడం కూడా చూసాడు జయరాం.

పరశురాం అలా తలుపులు ఎందుకు మూసుకుంటాడో అర్థమయిపోయింది జయరాంకు. పరశురాం మీద అసూయలాంటిది కలిగింది. వయసు పైబడ్డంవల్ల బట్టతల ఏర్పడి, మిగిలిన వెంట్రుకలు కూడా తెల్లబడి వున్న పరశురాంలో సెక్సు సామర్థ్యం అధికంగా వుండడానికి కారణమేమిటో అంతుబట్టలేదు జయరాంకు.

జయరాంకు కూడా చేవ తగ్గిందని కాదు— అతనికి చేవ రాత్రి వేళల్లోనే కలుగుతుంది. అదీ రోజుకు ఒక్కసారే. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి భేదం లేకుండా పరశురాం తన భార్యతో శృంగారాన్ని ఎలా కొనసాగిస్తున్నాడో అంతుపట్టడంలేదు జయరాంకు.

జయరాంకు ఏకాస్త తీరిక దొరికినా అతని చూపులన్నీ ఎదురింటి పరశురాం వైపే ఉంటాయి. ఆ లొకాలిటీలో ఇంకా చాలా కుటుంబాలున్నాయి, కానీ ఆ ఇంటి తలుపులన్నీ పగలల్లా తెరచుకునే ఉంటాయి. అందరి ఇళ్లలోనూ పడుచు జంటలున్నాయి. కానీ ప్రతి ఇంట్లో ప్రతిబంధకాలుగా ఆ జంటల సరసన పెద్దవాళ్లు కూడా జీవిస్తున్నారు. అందుకే పగలంతా ఆ ఇళ్ల తలుపులు మూసుకోలేదు. ఒకవేళ మూసినా పగటిపూట పరాజయం పొందుతాననే భయం. తన అసమర్థతకు తానే సిగ్గుపడిపోతున్నాడు.

ఒక రోజు సాయంకాలం జయరాం స్కూలు నుంచి ఇంటికి వచ్చాడు. (జయరాం విద్యార్థికాదు—

> జయరామ్ తలపులలో ఎదురింటి 'తలుపులు' సృష్టిస్తున్న అల్లకల్లోలానికి అర్థం మీరు తెలుసుకోండి!

ఉపాధ్యాయుడు) ఇల్లంతా చిందరవందరగా వుంది. అతని భార్య సుమన వారపత్రిక చదువుతూ ఈజీ ఛైర్లో కూర్చుని వుంది.

"ఇల్లు ఊడ్చలేదా సుమా!" అడిగాడు జయరాం

"లేదండీ! ఒళ్లంతా బద్ధకంగా వుంది" పుస్తకం లోంచి తల ఎత్తకుండానే అంది సుమన.

"ఇల్లు ఊడ్చడానికి కూడా ఇల్లాలికి బద్దకమైతే ఎలా" అంటూ చొక్కా విడిచి హేంగర్‌కు తగిలించాడు జయరాం.

"ఇల్లూడ్చే పనికి ఇల్లాలేమిటి? ఇంటాయనేమిటండీ! ఇంట్లో ఇద్దరం కాపురముంటున్నాం కదా— ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం ఇద్దరిదీ బాధ్యతే కదా! ప్రతి రోజూ నేనే ఊడుస్తున్నా కదా! కొన్నాళ్లు మీరు కూడా ఊడిస్తే ఏమౌతుందో?"

"సుమా!" ఖంగుతిన్నట్టున్నాడు జయరాం.

"చదువుకున్న వారు పైగా నలుగురికి అభ్యుదయం గురించి బోధించే ఉపాధ్యాయులు. మీరే ఆచరించకుంటే ఎలా?"

"మగాడు ఇల్లూడ్చడం అభ్యుదయమా?"

"అదే వద్దన్నాను— ఆడది, మగాడు అన్న భేదాలు మనిషికుండ కూడదంటున్నాను. ఇల్లూడ్చడానికి చీపురు పట్టడానికి ఒక చెయ్యి

[illegible] 116/— బహుమతిగా అందజేస్తాం!

వుంటే చాలు— మీకు ఆ చెయ్యి ఉన్నప్పుడు ఆడ, మగ భేదంతో పనేమిటి?''

''ఈరోజు ఇల్లూడ్చమంటావు! రేపు వంట కూడా చేయమంటావు!'' కోపంగా అన్నాడు జయరాం.

''అవునండీ! వంట చేస్తే వచ్చే ముప్పేమిటి? భార్యాభర్తలన్నాక అన్నింట్లోనూ కలిసి మెలిసి వుండాలి. ఒకరు చాకిరీ చేస్తుంటే మరొకరు ఏమీ పట్టించుకోకుండా వుంటే ధర్మమా? భార్యను కూడా సుఖపెట్టాలనే స్వభావం భర్తలకు రావాలండీ... నేను మీకు శత్రువును కానుగా! నాకు బదులుగా ఇంటిపనులు చేసి నన్ను తృప్తిపర్చే అర్హత మీకు కాక మరెవరికుంటుంది? నా బట్టలుతికినా తప్పేమీ కాదు''

''నీ మాట నేను కాదనడంలేదు సుమా! నీవు ఏ పనీ చేయలేని స్థితిలో వున్నప్పుడు అన్ని పనులనూ నేనే చేస్తాను... నువ్వు ఆరోగ్యంగానే వుండీ...''

''ఈ స్థితిలో ఎందుకు చేయరో చెప్పండి? బయటికి వెళ్లి లేబర్ వాడి లాగా బరువులు మోసే పనులు చేసి అలసిపోయి ఇంటికి రాలేరు కదా!''

''బరువు పనులు చేయకపోయినా సంపాదన వచ్చే ఉద్యోగమేగా నేను చేస్తున్నదీ''

''అంటే మీరు సంపాదిస్తున్నారు కాబట్టి నేను. ఇంటి పనులు చేయాలంటారు''

''అవును మరి''

''అదే నిజమనుకుంటే— మీరు ఏభై వేలు కట్నం తీసుకున్నారు. కనీసం నెలకు నాలుగు రూపాయలకు వడ్డీ ఇచ్చినా నెలకు రెండువేలు నేను సంపాదిస్తున్నట్లే కదా లెక్క. ఆ లెక్కన మీరు నెలకు నా కంటే నాలుగొందలు తక్కువే సంపాదిస్తున్నారు... మీరే నాకు రుణ పడ్డారు. ఇంటి పనుల్లో సహకరించి రుణ విముక్తులుకండి'' ఖండితంగా చెప్పేసింది సుమన.

జయరాంకు ఏం మాట్లాడాలో తోచలేదు. ఏం మాట్లాడినా గొడవ పెద్దదౌతుందనుకున్నాడు. గొడవ పెంచుకోవడం తనకు ఇష్టంలేదు. ఆ మాటా ఈమాటా మాట్లాడి తన భార్య దృష్టిలో మరింత చులకన కావడం అతనికేమాత్రం ఇష్టంలేదు.

ఇంటి పనులను చేయబూనుతుంటే— అతనికి తనింటి తలుపులు గుర్తొచ్చాయి. తను ఇంటి పనులు చేయడం ఇతరులు చూడకూడదు కాబట్టి, తలుపులు దగ్గరగా మూస్తుంటే— ఎదురింటి తలుపులు గుర్తొచ్చాయి. ఆ తలుపులు ఎప్పుడూ ఎందుకు మూసుకొని వుంటాయో అప్పుడర్థమైంది జయరాంకు.

●

# కవలలు

## ఎస్. శ్రీనివాసమూర్తి



ఏదేదో ఆలోచనలతో సైకిల్ తొక్కుతున్న సుబ్బారావు తన ఆఫీసురావడంతో ఆలోచనలతో పాటు సైకిల్‌కు కూడా బ్రేకు వేశాడు. సైకిల్ స్టాండులో పెట్టి వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు గుమాస్తా సుబ్బారావు. పని చేయాలని లేదు. కాని బాస్ ఉగ్రరూపం కళ్ళముందు కదలగానే చండశాసనుడైన అతడికి భయపడి, బలవంతంగా ఫైల్ ముందేసుకుని తెరిచాడు. అక్షరాలకు బదులుగా అందులో ప్రసవవేదన పడుతున్న తన భార్య కమల కనిపించింది. వెంటనే ఫైల్ మూసేశాడు. ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కిపోతోంది.

డెలివరీ కోసం భార్య కమలను విజయా హాస్పిటల్‌లో చేర్పించి వచ్చాడు సుబ్బారావు. భార్యకు తోడుగా తన తల్లిని ఉంచి వచ్చాడు. తనూ అక్కడే ఉండేవాడే కాని మరీ టెన్షన్‌గా ఉంటుందని ఆఫీసుకు వచ్చి కూర్చున్నాడు. ఒకటి రెండు గంటల్లో డెలివరీ అవుతుందని డాక్టర్ మాధవి చెప్పింది. డెలివరీ కాగానే తక్షణమే తనకు ఫోన్ చేసి చెప్పమని డాక్టర్ మాధవికి ఫోన్ నెంబర్ ఇచ్చి మరీ మరీ చెప్పివచ్చాడు. ఈసారైనా కొడుకు పుట్టాలని ముక్కోటి దేవతలకు మొక్కుకుంటున్నాడు ఇప్పటికే కొడుకుకోసం ఎదురు చూస్తూ ముగ్గురు కూతుళ్ళకు తండ్రి అయ్యాడు. దాంతో బాగా దిగులుపడిపోయాడు పాపం. వంశోద్ధారకుడు పుట్టలేదనే బాధ ఒక వైపు, పుట్టిన కూతుళ్ళకు ముందు ముందు పెళ్ళిళ్ళు ఎలా చేయాలనే బెంగ మరోవైపు అతన్ని పట్టి పీడిస్తున్నాయి. దీనికి తోడు తన తల్లి దండ్రులకు మనవణ్ణి అందించలేదనే అలక, భార్య కమల కొడుకుకోసం పడే తపన అతన్ని బాధిస్తున్నాయి. ఈసారి మాత్రం తప్పకుండా కొడుకే పుడతాడని తనకు, కమలకు గట్టి నమ్మకంగా ఉంది. అతని తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నది కూడా అందుకేగా మరి! ఇప్పుడెలాగూ కొడుకు పుట్టబోతున్నాడు కాబట్టి మరో గట్టి నిర్ణయం కూడా తీసేసుకున్నాడు. అదేంటంటే డెలివరీ కాగానే వెంటనే కమలకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ కూడా చేయించేయాలని.

''సార్! మీకు ఫోన్'' అన్న అటెండర్ రాజయ్య పిలుపుతో ఉలిక్కిపడి ఆలోచనలనుండి బయటపడ్డాడు సుబ్బారావు గబగబా ప్రక్కగదిలో ఉన్న ఫోన్ దగ్గరికి పరుగెత్తాడు.

''హల్లో! సుబ్బారావు గారేనా?''

''అవును సుబ్బారావునే మాట్లాడుతున్నాను మీరు...''

''విజయా హాస్పిటల్ నుండి డాక్టర్ మాధవిని మాట్లాడుతున్నాను''

''త్వరగా చెప్పండి డాక్టర్. కమల ప్రసవించిందా?''

''మీ భార్యకు ఇప్పుడే డెలివరీ అయింది. ముద్దులొలికే కవలలు పుట్టారు. ఇద్దరూ ఆడపిల్లలే''

అంతే! ఆ మాట వినగానే షాక్ కొట్టినట్టు అయింది సుబ్బారావుకు. చేతినుంచి రిసీవర్ జారి కిందపడిపోయి వేలాడుతోంది. కుప్పకూలిపోయాడు ఫ్లోర్ పైలో సుబ్బారావు.

●